క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి మంగళవారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా గౌడ్ సేవా సంఘం వారు వ్యవహరించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామికి పల్లకి సేవ, రాత్రి గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

వాహనం ఢీకొని యాచకుడి మృతి

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చి నగర పంచాయతీ పరిధిలో మంగళవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యాచకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం శివారులోని టోల్‌ప్లాజా వద్ద మంగళవారం వేకువ జామున గుర్తుతెలియన వాహనం ఢీకొనడంతో 54 ఏళ్ల యాచకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చిన్నారి అపహరణకు యత్నం

కొడవలూరు : ఊయలలో నిద్రిస్తున్న ఎనిమిది నెలల చిన్నారిని అపహరించేందుకు యత్నించిన ఘటన కొడవలూరు మండలంలోని రాజుపాళెందిన్నె వద్ద మంగళవారం చోటుచేసుకొంది. పోలీసుల వివరాల మేరకు.. రాజుపాళెం దిన్నెకు చెందిన శ్రీలిఖిత అనే ఎనిమిది నెలల చిన్నారిని బుచ్చి మండలం ఇస్కాపాళేనికి చెందిన లక్ష్మి (రమణమ్మ) తీసుకొని వెళ్తున్న సమయంలో స్థానికులు గుర్తించారు. వెంటనే ఆమెకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈమె గతంలో ఇలాంటి చర్యలకు పాల్పడినట్లు ఎస్సై సుబ్బారావు తెలిపారు.

యువకుడిపై హత్యాయత్నం

• సమీపై కేసు నమోదు



నెల్లూరు(క్రైమ్): పాత గొడవలను మనస్సులో పెట్టుకొని యువకుడిపై హత్యాయత్నం చేసిన ఘటనలో కోటమిట్టకు చెందిన రౌడీషీటర్ సయ్యద్ హసన్ అహ్మద్ హుస్సేనీ అలియాస్ సమీపై హత్యాయత్నం కేసును దర్గామిట్ట పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రొట్టెల పండగలో గంధ మహోత్సవం రోజున నెల్లూరు వారధి సెంటర్‌కు చెందిన నదీముద్దీన్.. సమీ మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. నదీముద్దీన్, అతని స్నేహితులను చంపుతానని సమీ బెదిరించారు. అప్పటి నుంచి అదను కోసం వేచిచూడసాగారు. ఈ నేపథ్యంలో నదీముద్దీన్ తన స్నేహితులతో కలిసి కిమ్స్ హాస్పిటల్ నుంచి దర్గా వద్దకు ఆదివారం వస్తుండగా, అంబేడ్కర్‌నగర్ వద్ద సమీ దాడి చేసి కత్తితో చంపేందుకు యత్నించారు. తప్పించుకొని పరారైన నదీముద్దీన్ దర్గామిట్ట పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో హత్యాయత్నం కేసును నమోదు చేశారు. నిందితుడు సమీని అరెస్ట్ చేసేందుకు దర్గామిట్ట పోలీస్ అధికారులు తమ సిబ్బందితో కలిసి ఆయన ఇంటి వద్దకు మంగళవారం వెళ్లారు. పోలీస్‌స్టేషన్‌కు రావాలని కోరగా, ఆయన నిరాకరించారు. పోలీసులు చెప్తున్నా పట్టించుకోకుండా ఇంట్లోకి వెళ్లి తలుపులేసుకున్నారు. అక్కడికి చేరుకున్న పలువురు సమీ మద్దతుదారులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హుటాహుటిన ఆయన ఇంటి వద్దకు చేరుకొని పరిస్థితిపై చర్చించారు. అనంతరం 11 గంటలకు స్టేషన్‌కు వస్తారని పోలీస్ అధికారులకు ఎమ్మెల్యే చెప్పారు.

పోలీసులపై కోటంరెడ్డి బెదిరింపు చర్యలు

సమీని 11 గంటలకు దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్టేషన్ వద్దకు చేరుకున్న ఆయన మద్దతుదారులు లోపలికి వెళ్లేందుకు యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మరికొందరు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. లోపలికి వెళ్లేందుకు యత్నించగా, విచారణ అనంతరం వెళ్లాలని పోలీస్ అధికారులు సూచించారు. దీంతో అసహనంతో కోటంరెడ్డి ఊగిపోయారు. తాము అప్పటి వరకు ఉండాలా.. తామేమైనా ఖాళీగా ఉన్నామా.. ఆర్నెల్లో అధికారం తమదేనని, ఆపై మీ బాగోతం ఉంటుందని పోలీస్ అధికారులపై తీవ్రస్థాయిలో బెదిరింపు చర్యలకు పాల్పడ్డారు.

14 రోజుల రిమాండ్

విచారణ అనంతరం సమీని పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపర్చగా, నిందితుడికి 14 రోజుల రిమాండ్‌ను విధించారు. దీంతో పోలీసులు ఆయన్ను జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు.

ఇంటింటికీ సంక్షేమ పాలన

• ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇస్కపాళెం పంచాయతీ, వడ్డిపాళెంలో గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రసన్న మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా వారికి జరిగిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చేపట్టిన పాదయాత్రలో ప్రజల కష్టాలను గుర్తించిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వాటిని మేనిఫెస్టోలో చేర్చి పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల్లో 99 శాతం అమలు చేశామన్నారు. రాష్ట్రంలో దాదాపు రూ.2 లక్షల కోట్లతో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ కుల, మత, పార్టీలకు అతీతంగా అందజేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ముఖ్యంగా రాష్ట్రంలో గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ, ఆర్బీకేలను తీసుకొచ్చి దేశానికి ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. మన వ్యవస్థలను ఇతర రాష్ట్రాల వారు కూడా అమలు చేయడం హర్షించదగిన విషయమన్నారు. ఇప్పటి వరకు 79 సచివాలయాల పరిధిలో 92,415 ఇళ్లను సందర్శించానని, ప్రతి ఇంటి వద్ద ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించడంతో పాటు స్థానిక సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసులు, కౌన్సిలర్లు షకీలా బేగం, మల్లారెడ్డి, సత్యనారాయణ, నాగరాజు, నాయకులు భరత్, ప్రవల్లిక, ఏపీఎం ఎంపీడీ శ్యామ్, ఏపీఎం లలితా పాల్గొన్నారు.

సలహాలు, అభిప్రాయాలు తెలపండి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కూర్మనాథ్

వెంకటాచలం: ఓటర్ల జాబితాకు సంబంధించి జరుగుతున్న ఇంటింటి సర్వే, పోలింగ్ బూత్‌ల క్రమబద్ధీకరణ తదితరాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు వారి సలహాలు, అభిప్రాయాలు తెలియజేయాలని జాయింట్ కలెక్టర్, సర్వేపల్లి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఆర్.కూర్మనాథ్ తెలిపారు. మండల కేంద్రమైన వెంకటాచలం తహసీల్దార్ కార్యాలయంలో సర్వేపల్లి నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జేసీ మంగళవారం ఉదయం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మంగళవారం ఓటర్ల జాబితాకు సంబంధించి సమావేశం నిర్వహిస్తామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కృష్ణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ సోమిరెడ్డి



మాట్లాడుతున్న వెంకటశేషయ్య

నెల్లూరు (దర్గామిట్ట): అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య ఆరోపించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. సోమిరెడ్డి అనుచరుడు బుజ్జినాయుడు మట్టి అక్రమ తవ్వకాలకు సూత్రధారి అని, దీనికి సంబంధించిన ఆధారాలను చూపారు. సోమిరెడ్డి, అతని దొంగ బ్యాచ్ చేతివాటం.. ధనదాహానికి ఓ నిండు ప్రాణం బలైందని తెలిపారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అవినీతి ఆరోపణలు చేయడం సబబుకాదని సూచించారు. బుజ్జినాయుడికి చెందిన టిప్పర్ ఢీకొని ఓ బ్యాంక్ ఉద్యోగి మృతి చెందగా, ఏడుగురు గాయపడ్డారని చెప్పారు. ప్రమాదానికి కారణం కాకాణి వర్గమంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన సోమిరెడ్డి తెల్లారేసరికి వాటిని ఎందుకు డిలీట్ చేశారని ప్రశ్నించారు. ప్రమాదానికి కారణం కావడంతోనే సైలెంటయ్యారని, దీనికి ఆయన సమాధానం చెప్పాలన్నారు. టిప్పర్ యజమానైన బుజ్జినాయుడ్ని పోలీసులు విచారిస్తుంటే సీఐకి ఫోన్ చేసి దూషించడం నిజం కాదా.. ఆ సమయంలో పక్కా ప్లాన్‌తో స్టేషన్ నుంచి తప్పించింది నీవు కాదానని ప్రశ్నించారు. మట్టి దొంగలు, దోపిడీదారులకు సోమిరెడ్డి ఆశ్రయం కలిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నెల్లూరు శివప్రసాద్, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు తలమంచి సురేంద్రబాబు, తోటపల్లిగూడూరు మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన క్షేత్రం అభివృద్ధికి కృషి



మొక్కలను పరిశీలిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

వెంకటాచలం: సర్వేపల్లిలోని ఉద్యాన క్షేత్రం అభివృద్ధికి కృషి చేస్తామని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం బోర్డు మెంబర్ దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సర్వేపల్లి వద్ద ఉన్న ఉద్యాన క్షేత్రాన్ని మంగళవారం ఉదయం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మామిడి అంటు కట్టడం, మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ఇక్కడి ఉద్యాన క్షేత్రం అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎంవీ సుబ్బారెడ్డి, ఉద్యానశాఖ అధికారిణి ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ దామరమడుగు అధ్యక్షుడిగా ప్రదీప్



యాటా ప్రదీప్‌కుమార్

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని దామరమడుగు గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా యాటా ప్రదీప్‌కుమార్‌ను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్నకు ప్రదీప్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని వెల్లడించారు.

యువగళంలో పాల్గొన్న వారే వైఎస్సార్‌సీపీలో చేరారు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

• వైఎస్సార్‌సీపీ ముత్తుకూరు మండల ప్రధాన కార్యదర్శి సాయి

నెల్లూరు (దర్గామిట్ట) : తెలుగుదేశం పార్టీలో ఉండి లోకేశ్ యువగళం పాదయాత్రలో పాల్గొన్న వారే వైఎస్సార్‌సీపీలో చేరారని వైఎస్సార్‌సీపీ ముత్తుకూరు మండల ప్రధాన కార్యదర్శి యలమంద సాయి అన్నారు. నెల్లూరు నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ నేతలతో కలిసి ఆయన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సోమిరెడ్డి తనయుడు ఇష్టానుసారంగా మాట్లాడటం తగదన్నారు. అతని వ్యవహారశైలి నచ్చకపోవడం వల్లే వైఎస్సార్‌సీపీలో చేరినట్లు చెప్పారు. సోమిరెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు మత్స్యకారేతర ప్యాకేజీ గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. 2019 ఏప్రిల్ నాటికి ముత్తుకూరు మండలంలో అర్హులందరికీ మత్స్యకారేతర ప్యాకేజీ అందినట్లు వెల్లడించారు. కరోనా కష్టకాలంలో నియోజకవర్గ ప్రజలకు అండగా నిలిచింది కాకాణి అని గుర్తుచేశారు. కార్యక్రమంలో దువ్వూరు తేజ, జానకిరామ్‌రెడ్డి, వినయ్, ప్రకాష్, వాసు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కొత్తూరు విద్యార్థి



ఇందుకూరుపేట : ఆగస్టు 12వ తేదీ నుంచి బుచ్చిరెడ్డిపాళెంలో జరుగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పి.వెంకటేష్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వి.మల్లికార్జున మంగళవారం తెలిపారు. ఈ నేపథ్యంలో వ్యాయామ ఉపాధ్యాయుడు కె.ఆరోరాతో పాటు విద్యార్థి వెంకటేష్‌ను హెచ్‌ఎం అభినందించారు.

చిన్నారులను బడికి పంపాలి



పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న మహిళా పోలీస్

బుచ్చిరెడ్డిపాళెం : ప్రతి చిన్నారి బడికి వెళ్లాలని వవ్వేరు సచివాలయ మహిళా పోలీస్ ఆమని అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు సచివాలయ పరిధిలో పాఠశాలలకు వెళ్లని పిల్లలను ఆమె మంగళవారం గుర్తించారు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లలను పాఠశాలలకు పంపాలని సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొందరు తల్లిదండ్రులు వారి పిల్లలను బడికి కాకుండా పనులకు తీసుకెళ్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీంతో ప్రత్యేక నిఘా ఉంచి బడిఈడు పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించే విధంగా తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు వెల్లడించారు.

విజయవంతం చేయండి

తోటపల్లిగూడూరు : భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ హేమలత సూచించారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 9 నుంచి 30వ తేదీ వరకు ప్రతి గ్రామంలో సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రమంలో గ్రామాల్లో శిలాఫలకాలను ఆవిష్కరించడం, జాతీయ జెండాను ఎగురవేయడం, మట్టి నమూనాల సేకరణ, ప్రతిజ్ఞా కార్యక్రమాలు, స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకోవడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి దేశ భక్తిని చాటుకోవాలని ఎంపీడీఓ కోరారు.

సింహపురిలో శాంతి ర్యాలీ



నెల్లూరు(దర్గామిట్ట): మణిపూర్‌లో పరిస్థితులను చక్కదిద్దేలా చర్యలు చేపట్టాలని నెల్లూరు జిల్లా క్రైస్తవ సమాఖ్య వేదిక నేతలు కోరారు. ఈ మేరకు నగరంలో శాంతి ర్యాలీ, నిరసన ప్రదర్శనను మంగళవారం నిర్వహించారు. ఎండీ ప్రకాశం, డేవిడ్ దయాసాగర్, సురేంద్రబాబు, రాజశేఖర్ దాసరి, లూథర్ శామ్యూల్, హనోక్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పైపుల ఆటో దగ్ధం

• రూ.2.50 లక్షల నష్టం



పొదలకూరు : పట్టణంలోని నెల్లూరు మార్గంలో ఉన్న శ్రీవెంకటేశ్వర పీవీసీ పైపుల కంపెనీ వద్ద లోడుతో ఉన్న ఆటో సోమవారం రాత్రి దగ్ధమైంది. యజమానుల కథనం మేరకు వివరాలు.. పైపుల లోడుతో ఉన్న ఆటోను కంపెనీ ప్రాంగణంలో ఉంచారు. మరుసటిరోజు మంగళవారం వెళ్లి చూడగా పైపులతో సహా ఆటో పూర్తిగా దగ్ధమైంది. ఆటో కాలిపోవడానికి కారణాలు తెలియడం లేదని వారు వెల్లడించారు. ఆటో రూ.1.50 లక్షలు, పైపులు రూ.లక్ష కలిపి మొత్తం రూ.2.50 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు పేర్కొన్నారు.

పరుగు పందెంలో బంగారు పతకం



బంగారు పతకం తీసుకుంటున్న రేష్మా

ముత్తుకూరు : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదివే ఎస్‌కే రేష్మా అనే దివ్యాంగురాలు పరుగు పందెంలో బంగారు పతకం సాధించింది. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక అవసరాల పిల్లలకు నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడల పోటీల్లో రేష్మా ప్రతిభ చాటింది. పరుగు పందెంలో ప్రథమ స్థానం, సాఫ్ట్ బాల్‌లో ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం చల్లా శ్రీనివాసులురెడ్డి, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ స్రవంతి ఇతర ఉపాధ్యాయులు రేష్మాను అభినందించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు



పొదుపు మహిళలకు రుణాలు అందజేసిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని మహిళల ఆర్థికాభివృద్ధికి అన్ని విధాలా తోడ్పాటును అందిస్తున్నారని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఇస్కపాళెం పంచాయతీ పరిధిలోని వడ్డిపాళెంలోని పొదుపు సభ్యులకు స్త్రీనిధి రుణం కింద మంజూరు చేసిన రూ.2 లక్షల చెక్కును మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ ఆసరా కింద పొదుపు మహిళల రుణాలను మాఫీ చేయడంతో పాటు సున్నా వడ్డీకే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలను అందజేస్తున్నారని గుర్తుచేశారు. వైఎస్సార్ చేయూత కింద ఏటా రూ.18,500ను మహిళల ఖాతాల్లో జమచేస్తూ స్వయం ఉపాధి మార్గాలతో జీవనం సాగించేందుకు అవకాశం కల్పిస్తున్నారని వివరించారు. మహిళల భద్రతకు ప్రత్యేక చట్టాలను తీసుకొచ్చారని గుర్తుచేశారు. గత ఎన్నికల్లో మాదిరిగానే రాబోయే ఎన్నికల్లో మహిళలంతా ఏకతాటిపై నిలబడి తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, మండల, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు కోడూరు మధుసూదన్‌రెడ్డి, కావలి వెంకటేశ్వర్లు, మల్లి చిన్నబాబు, మోర్ల మురళి పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు ఆర్థిక భరోసా

• పొదుపు సంఘ సభ్యులకు సున్నావడ్డీ వర్తింపు
• ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న మహిళలు



సమావేశమైన పొదుపు సంఘాల సభ్యులు

కోవూరు : మహిళా సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తున్నారు. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాలకు పెద్ద ఎత్తున బ్యాంకుల నుంచి రుణాలు అందజేస్తున్నారు. దీంతో పాటు ఆసరా, కాపునేస్తం, ఈబీసీ నేస్తం వంటి పథకాలతో ఆర్థికంగా ఆదుకొంటున్నారు. అదేలా డ్వాక్రా రుణాలకు వైఎస్సార్ సున్నావడ్డీ పథకాన్ని వర్తింప చేస్తున్నారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకొని క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తున్న డ్వాక్రా సంఘాల సభ్యులకు వడ్డీ రాయితీని ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటికే మూడు విడతలుగా సున్నావడ్డీ నిధులను మహిళ ఖాతాలకు జమ చేయగా నాలుగో విడత వడ్డీ రాయితీని ఈనెల 11న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయనున్నారు. ఇందుకోసం సంఘాలు తీసుకొన్న అప్పు, తేదీ, పొదుపు ఖాతాల నంబర్లు, బ్యాంకుల ఐఎఫ్‌ఎస్సీ కోడ్ తదితర వివరాలను మండల స్థాయి అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

లబ్ధిదారుల వివరాలు ఇలా..

మండలం	పొదుపు సంఘాలు	సభ్యులు	జరిగిన లబ్ధి
కోవూరు	1,091	10,910	రూ.1.19 కోట్లు
బుచ్చిరెడ్డిపాళెం	1,393	13,930	రూ.1.76 కోట్లు
ఇందుకూరుపేట	1,929	10,290	రూ.1.28 కోట్లు
కొడవలూరు	1,094	10,940	రూ.1.21 కోట్లు
విడవలూరు	1,035	10,350	రూ.1.22 కోట్లు
మొత్తం	5642	56,428	రూ.6.53 కోట్లు

మాట తప్పని నేత సీఎం జగన్



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే పొదుపు రుణాలు మాఫీ చేశారు. మూడు విడతల మాఫీ సొమ్మును సభ్యుల ఖాతాలకు జమ చేశారు. మహిళల ఆర్థికాభివృద్ధికి జగనన్న ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు.

– కవరగిరి శ్రీలత, జెడ్పీటీసీ సభ్యురాలు

ప్రభుత్వ సహకారం బాగుంది



జగనన్న ప్రభుత్వంలో కుటుంబానికి ఆర్థిక భరోసాగా మహిళలు ఎదు గుతున్నారు. పారిశ్రామికవేత్తలుగా మహిళలు రాణించేలా సీఎం జగనన్న తోడ్పాటు అందిస్తున్నారు. పేదలకు ప్రభు త్వం అందిస్తున్న సహకారం చాలా బాగుంది.

– తుమ్మలపెంట పార్వతి, ఎంపీపీ, కోవూరు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోంది. వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా రాణించాలి. చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలి. ఈనెల 11న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సున్నావడ్డీ రాయితీలను జమ చేయనున్నారు.

– వెంకటస్వామి, ఏపీఎం, కోవూరు